క్లుప్తంగా

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

శిరివెళ్ల: మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ముఖేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో పల్స్‌పోలియోపై ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 3,535 మంది ఐదేళ్ల లోపు పిల్లలున్నారని వారి కోసం 21 బూత్‌లు, 42 టీంలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మరో మొబైల్ టీం ఏర్పాటు జరిగిందన్నారు. 3న చుక్కలు వేసుకోని వారికి 4,5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి చుక్కలు వేయాలన్నారు. డాక్టర్ దివ్య, సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవి కిషోర్, పీహెచ్‌ఎన్‌లు సరస్వతి, అవినాబీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

శిరివెళ్ల: స్థానిక 7వ వార్డులో రూ.15 లక్షల జెడ్పీ, మండల పరిషత్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనులను జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతు మేజర్ గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3 కోట్లతో సిమెంట్ రోడ్లు, మరో రూ.కోటిన్నరతో మురుగు కాల్వలు, కల్వర్టుల నిర్మాణాలు జరిగాయన్నారు. స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, రిటైర్డ్ ఏంఈఓ మహబూబ్‌బాషా, నాయకులు ముల్లా అన్వర్ భాషా, జాకీర్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న గంగుల ప్రభాకరరెడ్డి

శిరివెళ్ల: మండల కేంద్రంలో పునర్నిర్మించిన బసవేశ్వరస్వామి ఆలయంలో గురువారం విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. నంద్యాలకు చెందిన బ్రహ్మర్షి నందీశ్వర ఆలయ సిద్ధాంతి శశిభూషణ్ నేతృత్వంలో శ్రీ వరసిద్ధి వినాయక, బసవేశ్వరస్వామి, వీరభద్ర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు.

25న జిల్లాస్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 25వ తేదీన స్థానిక నెరవాటి ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి చెస్ పోటీలు ఓపెన్ కేటగిరిలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బారెడ్డి గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రాజశేఖరెడ్డి సౌజన్యంతో రూ.22వేలు నగదుతో పాటు జ్ఞాపిక అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 24వ తేదీలోగా ఎంట్రీ నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 9010451585 నెంబరు సంప్రదించాలని కోరారు. టోర్నమెంట్ డైరెక్టర్లు నెరవాటి ఆనంద్‌గుప్తా, కరస్పాండెంట్ నెరవాటి కృష్ణసాయిరోహిత్ ఉన్నారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం



ఎల్లావత్తుల సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కొత్త ఫీడర్

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తుల సబ్ స్టేషన్ పరిధిలో రూ.10 లక్షలతో మరమ్మతు పనులను చేసినట్లు ఏఈ రాఘవేంద్రా రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన బీరవోలు ఫీడర్‌ను పూజలు చేసి గురువారం ప్రారంభించారు. ఏఈ మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో లో ఓల్టేజీ సమస్య, స్తంభాలు దెబ్బతినడం,తీగలు తెగిపడటంతో కొత్త ఫీడర్,బ్రేకర్ ఏర్పాటు చేసి, స్తంభాలు, తీగలు కొత్తవి ఏర్పాటు చేయించామని చెప్పారు.

పథకాలపై ప్రచారం

నంద్యాల(వ్యవసాయం): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. గురువారం ప్రజా పోరు యాత్రలో భాగంగా పట్టణంలో లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. మహానందీశ్వరస్వామి టెంపుల్, గాంధీచౌక్, కల్పనాసెంటర్, రామ్‌నాథ్ థియేటర్ మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొట్టె చంద్రశేఖర్, రమేష్, స్వాతి, శివసాయి పాల్గొన్నారు.

25న ఆలయ వార్షికోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని విశ్వనగర్‌లో వెలసిన శ్రీషిర్డిసాయిబాబా దేవాలయం 12వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు రాఘవయ్య, కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఆదివారం స్వామి వారికి అభిషేకాలు, పూలంగి సేవ, పూజలు, మహామంగళ హారతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా కాల్వబుగ్గ పీఠాధిపతి శివసాయిబాబా, పట్టణ ప్రముఖులు పాల్గొంటారన్నారు.

భక్తుల కొంగు బంగారం జంబులా పరమేశ్వరి

● నేడు చండీయాగం, రేపు బోనాల పండుగ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కుందూనది ఒడ్డున వెలసిన జంబులా పరమేశ్వరి(జంబులమ్మ) కోరికలు తీరుస్తూ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. అమ్మవారి వేడుకలు ఈనెల 23, 24, 25 తేదీల్లో ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి.

160 ఏళ్ల క్రితం..

దాదాపు 160 ఏళ్ల క్రితం జంబులాపరమేశ్వరి ఆలయం కుందూనది, మద్దిలేరు వద్ద ఉండేది. అప్పట్లో రైతులు, రజకులు అమ్మవారిని సేవించేవారు. అమ్మవారిని దర్శించుకున్న వారికి కోరికలు నెరవేరుతుండటంతో క్రమేపీ భక్తుల సంఖ్య పెరిగింది. 25 ఏళ్ల క్రితం ఆలయం జీర్ణోద్ధరణకు నోచుకుంది. గతంలో ఆలయానికి వెళ్లాలంటే మద్దిలేరులో దిగి, ప్రవాహాన్ని దాటి వెళ్లాల్సి ఉండేది. అయితే వంతెన, సీసీ రోడ్డు నిర్మించడంతో ఆలయానికి వెళ్లడానికి మార్గం సుగమంగా మారింది. పచ్చని చెట్ల మధ్య ప్రకృతి బడిలో ఆలయం ప్రశాంతతను చేకూర్చుతుంది. ప్రతి మంగళ, శుక్రవారాలు, పండుగ రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని



అమ్మవారు

దర్శించుకుంటారు. ప్రతి ఏడాది మాఘ మాసం పౌర్ణమి రోజున అమ్మవారికి బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీ.

నేటి నుంచి ఉత్సవాలు..

ఈనెల 23వ తేదీన శారదా జ్యోతిష్య పీఠాధిపతి



జంబులాపరమేశ్వరి దేవాలయం

మాడుగుల నాగేంద్రశర్మ సారథ్యంలో అమ్మవారికి శ్రీసూక్త విధాన క్షీరాభిషేకాలు, చండీ యాగాలు నిర్వహిస్తారు. 24న పట్టణం నుంచి, సమీపంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. బోనాల పండుగ రోజున అమ్మవారిని వెండిచీరలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 25న గార్దబాల పోటీలను జరుగుతాయి.

ఏర్పాట్లు పూర్తి

బోనాల పండుగకు భక్తులు వేల సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో బారికేడ్లు ఏర్పాటు చేశాం . దాతల సహకారంతో భక్తులందరికీ అన్నదానం చేస్తాం. ఈ ఏడాది భక్తులు సంఖ్య పెరిగే అవకాశముండటంతో అందుకనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాం.

– గాండ్ల జగన్‌మోహన్, కమిటీ ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

చాగలమర్రి: రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 34 సమస్మాత్మక గ్రామాలను గుర్తించామని, ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఎంపీపీ వీరభద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహమ్మద్ సోహెల్, చక్రం షబ్బీర్, నాయబ్ రసూల్, ముల్లా.ఖాదర్‌బాషా డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

నంద్యాల(అర్బన్): పథకాల అమలులో గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా వలంటీర్ల సేవలను ప్రశంసించారు. ఎంపీడీఓ సౌభాగ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టారన్నారు. ఆయా వ్యవస్థల ద్వారా ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు వీటిని ఆదర్శంగా తీసుకుని అమలుకు చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రజలందరికీ మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికల వేళ టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వలంటర్ వ్యవస్థపై ఆరోపణలు చేయడం, కించపరుస్తూ వారు చేసిన వ్యాఖ్యలను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. అనంతరం మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఇద్దరికి సేవా వజ్ర, సేవారత్నకు ముగ్గురు, 239 మందికి సేవా మిత్రకు ఎంపిక కాగా వారికి ప్రసంశా పత్రం అందజేసి సన్మానించారు. ఏపీపీఎస్‌ఈ బోర్డు మెంబర్ సిద్ధం శివరాం , ఎంపీపీ ప్రభాకర్, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, డైరెక్టర్లు గిరిబోయిన చంద్రశేఖర్, శశికళారెడ్డి, నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రషీద్ పాల్గొన్నారు.



సేవా వజ్రతో పరదేశి పుల్లయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



ఉయ్యాలవాడలో గ్రామ వలంటీర్లను సన్మానించిన ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఉయ్యాలవాడ : ప్రజలకు మెరుగైన సేవలతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి వద్దకు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రఘురాం అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఎలాంటి వివక్షకు తావు లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను ఇళ్ల వద్దకే చేర్చడంలో వారి సేవలు అమోఘమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు సంక్షేమ వారధులుగా నిలిచారన్నారు. వలంటర్లీకు అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాన్ని ఈ ఏడాది 50 శాతం పెంచిందన్నారు. గతంలో సేవా మిత్రకు రూ.10 వేలు ఇస్తుండగా ఈ ఏడాది రూ.15 వేలు, సేవా రత్నకు రూ.20 వేల నుంచి రూ.30వేలు, సేవా వజ్రకు రూ.30 వేల నుంచి రూ.45 వేలకు పెంచిన ఘనత జగనన్నదేనన్నారు. అనంతరం వలంటర్లీకు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కప్పురం శివమ్మ, గగ్గెర వెంకటేశ్వర్లు, సత్తిగారి బాలిరెడ్డి, సర్పంచ్‌లు మేకల ఓబులేసు, గురుప్రసాద్‌రెడ్డి, జనపాల సాయిరెడ్డి, ఉమదేవి, రామమద్దిలేటిరెడ్డి, తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, ఏపీఓ రవిప్రకాష్, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

261 మంది వలంటీర్లకు సన్మానం

చాగలమర్రి: సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఇంటి వద్దకే చేరవేస్తున్న వలంటీర్లు అభినందనీయులని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో



వలంటీర్లతో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చాగలమర్రి–1వ సచివాలయ వలంటీర్ ఫక్కీర్ హుసేన్‌బీ, 3వ సచివాలయ వలంటీర్ అనంతలక్ష్మీ, 5వ సచివాలయ వలంటీర్ రమణ, ముత్యాలపాడు–1వ సచివాలయ వలంటీర్ మహమ్మద్ జానీ, చిన్నవంగలి వలంటీర్ లింగేశ్వరమ్మను సేవారత్న అవార్డుతో పాటు రూ.30వేల చెక్కులను అందజేసి సన్మానించారు. అలాగే మండలంలోని 261 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డుతో సత్కరించారు. జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, ఎంపీపీ వీరభద్రుడు, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, సర్పంచ్‌లు తులసమ్మ, గోవిందయ్య, బంగారు షరీఫ్, ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు పత్తినారాయణ, లక్ష్మిరెడ్డి, ఫయాజ్, రామగుర్విరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నివాళి..

డి.వనిపెంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెంచురెడ్డి సతీమణి సుబ్బలక్ష్మీ గురువాం గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చెరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి

శిరివెళ్ల: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ఎవరి పరిధిలో వారు బాధ్యతాయుతంగా పని చేద్దామని ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఎన్నికల నిర్వహణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరల్ ఆఫీసర్లు, పోలింగ్ బూత్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ ముందు, పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్‌కు 3 రోజుల ముందు నుంచి ఓటర్ స్లిప్‌లు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు అందజేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు వచ్చినప్పటి నుంచి పోలింగ్ ముగిసి వాటిని స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ, ప్రచారం, అభ్యర్థుల ఖర్చుల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఓటర్లకు మద్యం, డబ్బు, కానుకలు పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. సీఐ చంద్రబాబు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహించొద్దు

రుద్రవరం: ఎన్నికల నిర్వాహణ ప్రక్రియకు ఎంపికైన



రుద్రవరంలో బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ

ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహించరాదని, ఎన్నికల నియమావళిని అనుసరించి విధులు నిర్వర్తించాలని ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం సెక్టార్ అధికారులు, బీఎల్‌ఓలు,వీర్వోలు,పోలీసులతో ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 295 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అందులో 2,39,014 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఏవైనా సమస్యాత్మకమైనవి ఉంటే గుర్తించాలని చెప్పారు. తహసీల్దారు మురళీమోహన్,ఎంపీడీఓ రామచంద్ర, డిప్యూటీ తహసీల్దారు రవీంద్రప్రసాదు ఉన్నారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం



స్కిల్ డెవలప్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శిల్పా నాగినిరెడ్డి

నంద్యాల(అర్బన్): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే శిల్పా సేవా సమితి లక్ష్యమని శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్‌పర్సన్ శిల్పా నాగినిరెడ్డి తెలిపారు. స్థానిక విశ్వనగర్‌లో గురువారం శిల్పా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ పొందిన 60 మంది మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

విద్యార్థులు పట్టుదలతో రాణించాలి



సునీతను సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గోస్పాడు: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిణి సునీత సూచించారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హుసేని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జూనియర్ కళాశాలలను ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం దృష్టిలోఉంచుకొని అన్ని రకాల సౌకర్యాలను కల్పించిందని చెప్పారు. త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చివరగా అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను సన్మానించారు.

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ కాలనీలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా నిర్వహించే కల్యాణ మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్లకు విశిష్ట పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వార్ల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి 11గంటల వరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే సాయంత్రం ఉత్సవమూర్తులను కాలనీలోని పురవీధులు, ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ, ఇంజనీర్లు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కేంద్ర ప్రభుత్వ వైఖరి గర్హనీయం

నంద్యాల (సెంట్రల్): మద్దతు ధరకు చట్టబద్ధతతో సహా తమ న్యాయపరమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం అణిచివేతకు పాల్పడటం అన్యాయమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అన్నదాతలపై పోలీసులు భాష్పవాయు గోళాలు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించడంతో ఓ యువరైతు మరణించడం దురదృష్టకరమన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో బీజేపీ ప్రకటించిందని, 10 సంవత్సరాలైనా అమలుకు నోచుకోకపోవడంతో రైతన్నలు ప్రశ్నించడం తప్పెలా అవుతుందని నిలదీశారు. రైతుల నిరసనకు మద్దతు ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

నంద్యాల: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్, 10వ తరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి ఇంటర్మీడియెట్, 10వ తరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షలపై జిల్లా కలెక్టర్లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ సురేష్ కుమార్, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమీషనర్ సౌరబ్ గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, డీఈఓ సుధాకర్ రెడ్డి, ఆర్‌ఐఓ సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియెట్, 10వ తరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షలకు సుమారు 50 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా, ప్రశ్న పత్రాలు లీక్ కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో ఫర్నిచర్, ఫ్యాన్లు, తాగు నీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలన్ని సమకూర్చుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్మీడియెట్, 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ఇటీవలే సమావేశం నిర్వహించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, పరీక్షా కేంద్రాల సమీపాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

హామీలు అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): రైతులక్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతుల ఆందోళనపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. పదిరోజులుగా హర్యానా, పంజాబ్‌కు చెందిన వేలాది మంది రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని చూస్తే.. వారికి రైతు సమస్యల పరిష్కారంపై ఎంతమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.ఆందోళనకారులపై వాటర్ క్యాన్లు, రబ్బర్ బుల్లెట్లతో దాడులు చేయడం సమంజసం కాదన్నారు.

చంద్రశేఖర్ సేవలు మరువలేనివి

నంద్యాల టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ ఏవో డాక్టర్ చంద్రశేఖర్ సేవలు మరువలేనివని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక కాన్ఫరెన్స్ హాల్‌లో చంద్రశేఖర్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయ ఏవోగా డాక్టర్ చంద్రశేఖర్ తనదైన ముద్ర వేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేశారన్నారు. అనంతర ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా టీబీ, లెప్రసీ అధికారి శారదబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి



రేనాటి సూర్యచంద్రులకు నివాళులర్పిస్తున్న ఎంపీ పోచా, తదితరులు



ఆర్‌ఏఆర్‌ఎస్‌లో నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల శ్రీ చెన్న కేశవ స్వామి ఆలయంలో గురువారం శ్రీ రామకమిటీ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176 వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరలపై విప్లవ శంఖారావం పూరించిన వీరుడని వక్తలు కొనియాడారు.

నంద్యాల(సెంట్రల్): ఆంగ్లేయులపై తిరగబడ్డ తొలి తెలుగు స్వాతంత్ర సమరయోధుడు, రేనాటి ముద్దుబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయుడని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జ్ సహ సంచాలకురాలు విజయలక్ష్మి కీర్తించారు. గురువారం స్థానిక పరిశోధన స్థానంలో నరసింహారెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు విమానాశ్రయానికి ఆయన పేరును పెట్టి సముచితంగా గౌరవించిందన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): ఆంగ్లేయులతో విరోచితంగా పోరాటం గావించిన వీరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, అపరధాన కర్ణుడుగా బుడ్డా వెంగళరెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని



యర్రగుంట్లలో నరసింహారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కాలేజీ, వివేకానంద ఆడిటోరియంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమకు ఖ్యాతి తెచ్చిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి చరిత్రను నేటి తరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రేనాటి సూర్యచంద్రుల పుస్తకాలను ఆవిష్కరించారు. విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్, డాక్టర్ గెలివి సహదేవుడు, ఆర్‌వీ సుబ్బారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రామలింగారెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఓబులపతి, ఉదయ్‌శంకర్, నీలం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

దొర్నిపాడు: స్థానిక సచివాలయం–2 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో వైద్యనిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.